# మట్టికోర్టు యువరాజు!

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం



కార్లోస్ అల్కరాజ్ గార్ఫియా..అలియాస్ అల్కరాజ్! 2003 మే 5న స్పెయిన్‌లోని ఎల్‌పాల్మర్‌లో కార్లోస్ అల్కరాజ్ గొంజాలెజ్, వర్జీనియా గార్ఫియా ఎస్కాండెన్‌కు అల్కరాజ్ జన్మించాడు. పువ్వు పుట్టగానే పరిమళించిందన్నట్లు ఊహ తెలియని వయసులోనే అల్కరాజ్ రాకెట్ చేతపట్టాడు. తండ్రి టెన్నిస్ కోచ్ కావడంతో అల్కరాజ్‌కు ఉగ్గుపాలతోనే టెన్నిస్ పాఠాలు నేర్చుకున్నట్లు అయ్యింది. టెన్నిస్ దిగ్గజ త్రయమైన రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, నొవాక్ జొకోవిచ్‌ను చూస్తూ పెరిగిన అల్కరాజ్ పిన్న వయసు నుంచే రికార్డులు నెలకొల్పాడు. 2018లో 15 ఏండ్ల వయసు ఉన్నప్పుడే ప్రొఫెషనల్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఈ స్పెయిన్ నయాబుల్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. స్పెయిన్‌కే చెందిన దిగ్గజ రఫెల్ నాదల్‌ను ఆరాధ్య ఆటగానిగా భావించే అల్కరాజ్ అతని అడుగుజాడల్లో నడుస్తున్నాడు. 2021లో తొలుత టాప్-100 ర్యాంకింగ్స్‌లోకి అడుగుపెట్టిన కార్లోస్..యూఎస్ ఓపెన్ క్వార్టర్స్ చేరి టాప్-35లోకి దూసుకొచ్చాడు. 18 ఏండ్ల వయసులో 2022లో మియామి ఓపెన్ టైటిల్ గెలిచిన అల్కరాజ్ అదే ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌తో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఓపెన్‌ఎరాలో అతిపిన్న వయసు (19 ఏండ్ల 4నెలల 6రోజులు)లో ప్లేయర్‌గా అరుదైన రికార్డు నెలకొల్పాడు. అంతటితో ఆగకుండా నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుని తన ఆగమనాన్ని ఘనంగా చాటిచెప్పాడు. 2023లో ఏడుసార్లు చాంపియన్ జొకోవిచ్‌ను వింబుల్డన్‌లో మట్టికరిపిస్తూ చారిత్రక ఫైనల్లో టైటిల్ విజేతగా నిలిచాడు. అదే దూకుడు కొనసాగిస్తూ గతేడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి ట్రోఫీని ముద్దాడాడు. నాదల్‌ను స్ఫూర్తిగా తీసుకుంటూ మట్టికోర్టులో తనకు తిరుగులేదన్నట్లు ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేశాడు. ఫ్రెంచ్ ఓపెన్ ఇచ్చిన కిక్కును వింబుల్డన్‌లో కొనసాగిస్తూ రెండోసారి విజేతగా నిలిచాడు. తాజాగా ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ ఇదే ఒరవడి కొనసాగించి డిఫెండింగ్ చాంపియన్‌గా తన టైటిల్ నిలబెట్టుకున్నాడు. ఐదున్నర గంటల పాటు సుదీర్ఘంగా సాగిన తుదిపోరులో ప్రపంచ నంబర్‌వన్, ఇటలీకి చెందిన సిన్నర్‌ను ఓడిస్తూ మట్టికోర్టు యువరాజుగా మన్ననలు అందుకుంటున్నాడు. కెరీర్‌లో తొలిసారి రెండు సెట్లు కోల్పోయి వరుసగా మూడు సెట్లలో అసమాన పోరాటపటిమ కనబరిచి ఫ్రెంచ్ ఓపెన్‌పై తనదైన ముద్ర వేశాడు. మట్టికోర్టులో కొదమసింహాన్ని తలపిస్తూ సిన్నర్‌కు దీటైన పోటీనిచ్చాడు. మ్యాచ్ సిన్నర్‌కు చేజారుతుందనుకున్న ప్రతీసారి తనలో పోరాటయోధున్ని పరిచయం చేస్తూ రెండోసారి ఫ్రెంచ్ కింగ్‌గా నిలిచాడు.ఈ క్రమంలో 22 ఏండ్ల వయసులోనే ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన అల్కరాజ్..భవిష్యత్ టెన్నిస్ దిగ్గజంగా విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నాడు.

# తెలంగాణ సెయిలర్ల సత్తా

## మాన్సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ హుసేన్‌సాగర్ వేదికగా సోమవారం 16వ మాన్సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్ ఉత్సాహంగా మొదలైంది. మొత్తం ఏడు విభాగాల్లో 127 మంది సెయిలర్లు పోటీపడుతున్నారు. పోటీల తొలి రోజు తెలంగాణ సెయిలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. అండర్-19 మిక్స్‌డ్ డబుల్ క్లాస్ విభాగంలో తనూజా కామేశ్వర్-శ్రవణ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. మొదటి మూడు రేసులను గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచారు. ఇదే విభాగంలో రాష్ర్టానికి చెందిన కొమురవెల్లి దీక్షిత, గణేశ్ పీర్కట్ల రెండో స్థానం దక్కించుకున్నారు. సబ్‌జూనియర్ విభాగంలో స్థానిక సెయిలర్ మహమ్మద్ రిజ్వాన్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఆకట్టుకోగా, తమిళనాడుకు చెందిన కృష్ణకు రెండో స్థానం దక్కింది. బాలికల కేటగిరీలో లాహిరి కొమురవెల్లి..తమిళనాడు సెయిలర్ శ్రేయ కృష్ణకు గట్టిపోటీనిచ్చింది. తొలి రెండు రేసుల్లో చివరి వరకు ఆధిక్యం కనబర్చినప్పటికీ లాహిరి కొద్ది తేడాతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. మలేషియాలో జరిగే లాంగ్కావి యూత్ ఇంటర్నేషనల్ టోర్నీలో లాహిరి పోటీపడనుంది. మరోవైపు అండర్-19 జూనియర్స్ 29ఈఆర్ స్కిఫ్ క్లాస్‌లో గోవాకు చెందిన నేవీ యూత్ టీమ్ సెయిలర్లు కార్తీక్, హృదయ్ రెండు రేసులు గెలిచి ఆధిపత్యం చెలాయించారు. బాలుర అండర్-19 లేజర్ ఫ్లీట్‌లో ఎన్‌వైఎస్‌సీకి గోవాకే చెందిన శరణ్యయాదవ్ మూడు రేసులు గెలిచి టాప్ దక్కించుకుంది.



## పంత్‌కు గాయం



లండన్: ఇంగ్లండ్ పర్యటనలో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం సిద్ధమవుతున్న వేళ టీమ్ ఇండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న పంత్.. ఆదివారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా ఎడమ చేతికి స్వల్ప గాయమైంది. పంత్ ఎడమ మోచేతి వద్ద దెబ్బతగలడంతో అక్కడే ఉన్న ఫిజియోలు అతడికి ప్రథమ చికిత్స అందించి పంత్‌ను అక్కడ్నుంచి తీసుకెళ్లారు. దీంతో టీమ్‌ఇండియా అభిమానుల్లో ఆందోళన మొదలైంది. కానీ సోమవారం పంత్ యథావిధిగా బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు వచ్చిన తనదైన శైలిలో సిక్సర్లు బాదాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవడంతో ఫ్యాన్స్ ఊపిరిపీల్చుకున్నారు.

# భారత్‌దే పైచేయి

## రెండో టెస్టు డ్రా • తనుష్, కంబోజ్ అదుర్స్

నార్తాంప్టన్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత్ 'ఏ' జట్టు రెండో అనధికారిక టెస్టులో అదరగొట్టింది. ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 21 పరుగుల కీలక ఆధిక్యం దక్కించుకున్న భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ 417/7 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ హీరో కేఎల్ రాహుల్ (51) రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. జైస్వాల్ (5) మరోసారి నిరాశపరిచినా కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (80)తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ధ్రువ్ జురెల్ (28) ఫర్వాలేదనపించగా.. నితీశ్ కుమార్ రెడ్డి (42), శార్దూల్ ఠాకూర్ (34) మెరిశారు. ఇక లోయరార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన తనుష్ కొటియాన్ (108 బంతుల్లో 90 నాటౌట్, 10 ఫోర్లు, 1 సిక్స్), అన్షుల్ కంబోజ్ (51 నాటౌట్) ఇంగ్లీష్ బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారారు. ఈ ఇద్దరూ పట్టుదలగా ఆడి భారత ఆధిక్యాన్ని 400 పరుగుల మార్కును దాటించారు. టీ విరామ సమయానికి తనుష్ సెంచరీకి పది పరుగుల దూరంలో ఉన్నా కెప్టెన్ ఈశ్వరన్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. 439 పరుగుల ఛేదనలో బరిలోకి దిగిన ఇంగ్లండ్ లయన్స్.. 11 ఓవర్లు బ్యాటింగ్ చేసి 32 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. మరో గంట ఆట మిగిలున్నా ఇరుజట్ల సారథుల అంగీకారంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ అదరగొట్టిన అన్షుల్.. బంతితోనూ రెండు వికెట్లు పడగొట్టి లయన్స్‌ను భయపెట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ అతడు రెండు వికెట్లు తీశాడు.



తనుష్

అన్షుల్

## కోల్‌కతా టు ఢిల్లీ

ముంబై: స్వదేశం వేదికగా జరుగనున్న అంతర్జాతీయ సిరీస్‌ల షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. అక్టోబర్‌లో కోల్‌కతా ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరుగాల్సిన భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు మ్యాచ్‌ను ఢిల్లీకి బదిలీ చేశారు. దీనికి తోడు నవంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు ఢిల్లీలో జరుగాల్సిన భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు వేదికను కోల్‌కతా మార్చారు. వీటికి సంబంధించిన రీషెడ్యూల్‌ను బీసీసీఐ సోమవారం విడుదల చేసింది. మరోవైపు స్వదేశం వేదికగా జరుగనున్న మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీకి ముందు సన్నాహకంగా భారత్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను చెన్నై నుంచి న్యూచండీగఢ్, ఢిల్లీకి మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. మహిళల వన్డే ప్రపంచకప్‌లో భాగంగా బెంగళూరు తొలి, ఫైనల్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వబోతున్నది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తొలిసారి 'ఏ' జట్లతో అనధికారిక టెస్టు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

# యూఈఎఫ్ఏ నేషన్స్ లీగ్ చాంప్ పోర్చుగల్

## హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్‌పై విజయం

## అదరగొట్టిన రొనాల్డో







మ్యూనిచ్: యూఈఎఫ్ఏ నేషన్స్ లీగ్ చాంపియన్‌షిప్‌లో పోర్చుగల్ టైటిల్ విజేతగా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో పోర్చుగల్ 5-3(పెనాల్టీ షూటౌట్)తో స్పెయిన్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. 2004 యూరో కప్‌లో స్పెయిన్‌ను ఓడించిన పోర్చుగల్ ఇన్నేండ్ల తర్వాత మరో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. రెండోసారి నేషన్స్ లీగ్ టైటిల్ సొంతం చేసుకున్న పోర్చుగల్‌కు స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో కీలకంగా నిలిచాడు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో పోర్చుగల్ తరఫున నూనో మెండెస్(26ని), రొనాల్డో(61ని) గోల్స్ అందించగా, మార్టిన్ జుబిమెండి(21ని), మికెల్ ఒయర్‌జబాల్(45ని) స్పెయిన్‌కు గోల్స్ చేశారు. ఆది నుంచే ఇరు జట్లు గోల్స్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ మొదలైన 21నిమిషానికి మార్టిన్ చేసిన గోల్‌తో స్పెయిన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే స్పెయిన్ సంబరం ఎక్కువసేపు నిలువలేదు. ఐదు నిమిషాల వ్యవధిలో మెండెస్ గోల్ చేయడంతో స్కోరు 1-1తో సమమైంది. అయితే మ్యాచ్ ప్రథమార్ధం ముగుస్తుందన్న తరుణంలో పోర్చుగల్ డిఫెన్స్‌ను ఏమారుస్తూ మికెల్ చేసిన గోల్‌తో స్పెయిన్ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. స్కోరు సమం చేసేందుకు పోర్చుగల్ చేసిన ప్రయత్నాలు 61వ నిమిషంలో రొనాల్డో గోల్‌తో సాధ్యమయ్యాయి. తనదైన శైలిలో రొనాల్డో గోల్ చేయడంతో స్కోరు 2-2తో సమమైంది. చివరి వరకు ఇరు జట్లు నిర్ణీత సమయంతో పాటు అదనపు సమయంలోనూ చేసిన గోల్ ప్రయత్నాలు నెరవేరలేదు. దీంతో విజేతను నిర్ణయించేందుకు అనివార్యమైన పెనాల్టీ షూటౌట్‌లో పోర్చుగల్ 5-3తో స్పెయిన్‌ను ఓడించింది. పోర్చుగల్ తరఫున రుబెన్ నెవిస్, నూనో మెండిస్, బ్రూనో ఫెర్నాండెజ్, వితిన్హా, గొంకాలో రామోస్ గోల్స్ చేశారు. కెరీర్‌లో 138వ అంతర్జాతీయ గోల్ ఖాతాలో వేసుకున్న రొనాల్డో మ్యాచ్ ముగిసిన తర్వాత తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఉబికి వస్తున్న కన్నీటిని నియంత్రించుకుంటూ సహచరులతో కలిసి విజయాన్ని ఆస్వాదించాడు.

## ● ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ధోనీ



భారత క్రికెట్ జట్టుకు మూడు ఐసీసీ ట్రోఫీలను అందించిన దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనీకి ప్రతిష్ఠాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. ధోనీతో పాటు మాథ్యూ హేడెన్ (ఆసీస్), గ్రేమ్ స్మిత్, హషీమ్ ఆమ్లా (దక్షిణాఫ్రికా), సనా మిర్ (పాకిస్థాన్) ఈ జాబితాలో ఉన్నారు.

# మహిళా అంపైర్‌తో అశ్విన్ వాగ్వాదం



చెన్నై: తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లో వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీరు వివాదాస్పదమైంది. టీఎన్‌పీఎల్‌లో భాగంగా ఐడ్రీమ్ తిర్పూర్ తమిజాన్స్‌తో కొయంబత్తూర్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దుండిగల్ డ్రాగన్స్ తరఫున బరిలోకి దిగిన అశ్విన్ తాను ఔటైన తీరుపై తీవ్ర అసహనానికి లోనయ్యాడు. సాయి కిషోర్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో ప్యాడిల్ స్వీప్ చేయబోయిన అశ్విన్‌ను మహిళా అంపైర్ క్రితికా వెంకటేశన్ ఔట్‌గా ప్రకటించింది. లెగ్ సైడ్ వెళుతున్న బంతికి ఎల్బీడబ్ల్యూ ఎలా ఇస్తారంటూ అంపైర్‌తో అశ్విన్ వాగ్వాదానికి దిగాడు. ఇవన్నీ ఏం పట్టించుకోని క్రితిక తన నిర్ణయానికి కట్టుబడుతూ అలాగే ఉండిపోయింది. దీంతో మరింత చిర్రెత్తిపోయిన అశ్విన్.. ప్యాడ్లను బ్యాట్‌తో బలంగా కొడుతూ గ్లౌవ్స్‌ను డగౌట్ వైపు విసిరివేయడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. మహిళా అంపైర్‌తో అశ్విన్ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శల పాలు అవుతున్నది.

# వేదం చదివిన శరభం యుద్ధానికి దిగింది



'నా శివుడి అనుమతిలేనిదే ఆ యముడైనా కన్నెత్తి చూడడు..నువ్వు చూస్తావా? అమాయకుల ప్రాణాలు తీస్తావా?' అంటూ ప్రళయ కాల రుద్రుడివలే 'అఖండ-2: తాండవం'కు సిద్ధమయ్యారు అగ్ర నటుడు బాలకృష్ణ. ఆయన తాజా చిత్రం 'అఖండ-2' దసరా కానుకగా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో 14 రీల్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. నేడు బాలకృష్ణ జన్మదినం. ఈ సందర్భంగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. కైలాస పర్వతం నేపథ్యంలో మొదలైన టీజర్ ఆద్యంతం రోమాంచితంగా సాగింది. అఖండగా బాలకృష్ణ పాత్ర రౌద్రరసపూరితంగా సాగింది. 'వేదం చదివిన శరభం యుద్ధానికి దిగింది..' అనే సంభాషణతో ముగిసిన టీజర్ అభిమానులకు కావాల్సినంత థ్రిల్‌ను పంచింది. దర్శకుడు బోయపాటి శ్రీను యూనిక్ మేకింగ్, బాలకృష్ణ హై ఇంటెన్సిటీ పర్‌ఫార్మెన్స్, కైలాసగిరి నేపథ్య విజువల్స్ టీజర్‌పై అంచనాలు పెంచాయి. ఈ చిత్రానికి సంగీతం: తమన్, సమర్పణ: తేజస్విని నందమూరి, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.

# ఈ గూఢచారి.. ఓ మానవ యంత్రం



'నీకు నా గురించి తెలియదు. ఇప్పుడు తెలుసుకుంటావ్..', 'నా కళ్లు నిన్ను ఎప్పటి నుంచో వెంటాడుతున్నాయి కబీర్' అనే పవర్‌ఫుల్ సంభాషణలతో గత నెలలో ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా విడుదలైన 'వార్-2' టీజర్ ప్రేక్షకుల్లో అంచనాల్ని అమాంతం పెంచింది. ఎన్టీఆర్ పాత్రను ప్రజెంట్ చేసిన విధానం అభిమానుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ లుక్స్, కాస్ట్యూమ్స్ గురించి చిత్ర కాస్ట్యూమ్ డిజైనర్ అనైతా ష్రాఫ్ అడజానియా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఎన్టీఆర్ సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తే అందరిలో ఏదో తెలియని ఎనర్జీ వచ్చిన భావన కలుగుతుందని, ఆయన ఆకర్షణ శక్తి అలాంటిదని ప్రశంసించారు. ఎన్టీఆర్ పాత్రలో ఎన్నో లేయర్స్ ఉంటాయని, వాటికి తగినట్లుగా డిఫరెంట్ లుక్స్, కాస్ట్యూమ్స్ డిజైన్ చేశామని, ఈ సినిమాలో ఆయన ఓ లక్ష్యంతో పనిచేసే మానవ యంత్రంలా కనిపిస్తారని అనైతా ష్రాఫ్ వివరించారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ 'రా' విభాగం గూఢచారి పాత్రలో కనిపించనున్నారు.


# చిత్రం

# టాలీవుడ్‌లో సూపర్ హీరోల సీజన్



సూపర్‌హీరో కాన్సెప్ట్‌లకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఎక్కువ. ఈ తరహా చిత్రాలు హాలీవుడ్‌లో ఎక్కువ తయారవుతుంటాయి. అయితే.. ఈ ట్రెండ్ కొన్నేళ్ల క్రితం మనదేశంలోనూ మొదలైంది. బాలీవుడ్‌లో రాకేష్ రోషన్ తెరకెక్కించిన 'కోయీ మిల్‌గయా'తో మొదలైన ఈ సూపర్‌హీరో ఫీవర్.. యష్ రాజ్ ఫిల్మ్స్ 'ధూమ్'తో మరింత హీటెక్కింది. 'కోయీ మిల్‌గయా'కు కొనసాగింపుగా 'క్రిష్' ఫ్రాంచైజీ మూడు భాగాలుగా రాగా, ఇప్పుడు నాలుగో భాగం తెరకెక్కించేందుకు హృతిక్ రోషన్ సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకూ 'క్రిష్' ఫ్రాంచైజీని రాకేష్ రోషన్ రూపొందించారు. ఈ నాలుగో భాగాన్ని మాత్రం హృతిక్ రోషనే స్వయంగా డైరెక్ట్ చేయనున్నారు. ఇక 'ధూమ్' ఫ్రాంచైజీ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే విడుదలైన మూడు భాగాలూ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. త్వరలోనే 'వార్ 2' దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణ్‌బీర్‌కపూర్ హీరోగా నాలుగో పార్ట్‌ని యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించనుంది. ఇదంతా బాలీవుడ్ కహానీ. ఇక టాలీవుడ్ విషయానికొస్తే మనకు కూడా సూపర్‌హీరో కాన్సెప్టులు కొత్తేం కాదు. గతంలో సీనియర్ ఎన్టీయార్ ఇలాంటి పాత్రలు ఎన్నో చేశారు. చిరంజీవి చేసిన జగదేకవీరుడు-అతిలోకసుందరి, కొదమసింహం లాంటి చిత్రాలు ఓ విధంగా సూపర్‌హీరో కాన్సెప్టులే. ప్రస్తుతం తెలుగులో తెరకెక్కుతున్న సూపర్ హీరో సినిమాల విషయానికొస్తే.. ముందు చెప్పుకోవాల్సిన సినిమా 'హరి హర వీరమల్లు'. ఇందులో రాబిన్‌హుడ్ తరహా పాత్రను పోషించారు పవన్‌కల్యాణ్. మొఘల్ సామ్రాజ్యాధినేత ఔరంగజేబుతో తలపడే పాత్ర ఆయనది. సూపర్‌హీరో చేసే సాహసాలన్నీ ఇందులో పవన్ కల్యాణ్ పాత్ర చేస్తుందని సమాచారం. ముఖ్యంగా పిల్లలు ఇష్టపడేలా ఆయన పాత్ర సాగుతుందని అంటున్నారు. ఈ ఏడాది రానున్న మరో సూపర్‌హీరో సినిమా 'విశ్వంభర'. ప్రపంచాన్ని కాపాడేందుకు, మానవ శక్తితో మరో గెలాక్సీలోకి అడుగుపెట్టిన ఓ సామాన్యుడి కథ ఇది. ఇందులో చిరంజీవి కారణజన్ముడిగా కనిపిస్తారు. ఈ సినిమాలో మెగాస్టార్‌పై చిత్రీకరించిన యాక్షన్ ఎపిసోడ్స్ రోమాంచితం చేస్తాయని సమాచారం. 70శాతం సీజీతో తెరకెక్కిన ఈ సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు భారీగానే ఉన్నాయి. దసరా కానుకగా ఈ సినిమా వచ్చే అవకాశం ఉంది. అల్లు అర్జున్‌తో అట్లీ చేయబోతున్న 'ఐకాన్'(ప్రచారంలో ఉన్న పేరు) సినిమా కూడా సూపర్‌హీరో కాన్సెప్టే అని టాక్. పైగా ఇందులో బన్నీ త్రిపాత్రాభినయం చేస్తున్నారట. ఈ సినిమాలో తాను పోషించనున్న పాత్రల కోసం న్యూయార్క్ ఫిల్మ్ స్టూడియోలో టెస్ట్ షూట్ కూడా పూర్తి చేశారని టాక్. ఒకే స్క్రీన్‌పై ఒకే రూపంలో ఉన్న ముగ్గురు సూపర్ హీరోలు.. అట్లీ ప్లాన్ నిజంగా అదిరిపోయిందంటున్నారు సినీ అభిమానులు. ఇక 'హను-మాన్'ఫేం తేజా సజ్జా నటిస్తున్న 'మిరాయ్' సినిమా కూడా సూపర్‌హీరో కాన్సెప్టే. విధికి ఎదురెళ్లిపోరాడే ఓ యోధుడి కథగా ఈ సినిమాను దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్నారు. ఇంకా ప్రశాంత్‌వర్మ యూనివర్స్ నుంచి రాబోతున్న మహాకాళి, అధీర చిత్రాలు సైతం సూపర్‌హీరో కాన్సెప్టులతోనే రూపొందనున్నాయి. అమీర్‌ఖాన్‌తో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ తెరకెక్కించబోయే సినిమా కూడా సూపర్‌హీరో కథాంశమే అని వినికిడి. ఈ విధంగా స్టార్ హీరోలంతా సూపర్ హీరోలుగా మారే పనిలో పడ్డారన్నమాట. మరి ఈ ట్రెండ్ ఇంకెన్నాళ్లు కొనసాగుతుందో చూడాలి.

# తమ్ముడి హంగామా



నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రధారులు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 4న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ నెల 11న సాయంత్రం 5గంటలకు ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా 'తమ్ముడు' మూవీ ట్రైలర్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ వీడియోను ఫన్నీగా మేకర్స్ డిజైన్ చేశారు. లయ, వర్ష బొల్లమ్మ, స్వసిక విజయన్, సప్తమి గౌడ, బేబీ శ్రీరామ్‌ఆదిత్య అందరూ కలిసి ఈ సినిమా ట్రైలర్ రిలీజ్‌కి తామంటే తామే కారణమని గొడవ పడుతుండగా.. దర్శకుడు శ్రీరామ్ వేణు వచ్చి 'మీ డౌట్స్ అన్నీ క్లారిఫై కావాలంటే ముందు ట్రైలర్ చూడండి..' అని చెప్తాడు. ఈ విధంగా మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి పెరిగే విధంగా ట్రైలర్ అనౌన్స్‌మెంట్ వీడియోను మేకర్స్ డిజైన్ చేశారు. ఎంసీఏ, వకీల్‌సాబ్ చిత్రాల తర్వాత శ్రీరామ్ వేణు దర్శకత్వం వస్తున్న ఈ సినిమా దర్శకుడిగా అతని స్థాయిని మరింత పెంచేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోకనాథ్.

# వర్ణించ తరం కానిది నీ ప్రేమ..



అన్యోన్య దాంపత్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు కోలీవుడ్ క్యూట్ కపుల్ నయనతార, విఘ్నేష్. ఈ జంట దంపతులై సోమవారానికి మూడేళ్లు. ఈ సందర్భంగా నయనతార షేర్ చేసిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలతోపాటు తన భర్తకు ఓ అద్భుతమైన ప్రేమలేఖను కూడా రాసేశారు నయనతార. 'ఒకరిపై ఒకరు ఇంతలా ఎలా ప్రేమ చూపుతారనేది ఎప్పటికీ సమాధానం దొరకని ప్రశ్నే అనుకున్నాను. కానీ.. నీ రూపంలో దానికి సమాధానం దొరికింది. వర్ణించడానికి అలవికానిది నీ ప్రేమ. నా మనసు కోరుకునే ప్రేమవు నువ్వు. ఇద్దరిగా మొదలైన మన ప్రయాణం నలుగురిగా మారింది. కోరుకోవడానికి ఇంతకు మించి ఏముంటుంది? స్వచ్ఛమైన ప్రేమను పంచుతున్న నా జీవిత భాగస్వామికి పెళ్లిరోజు శుభాకాంక్షలు.' అని పొయెటిగ్గా విష్ చేశారు నయనతారు. ఈ పోస్ట్ చూసిన వారంతా ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# 250కోట్ల కలలసౌధం



బాలీవుడ్ స్టార్ కపుల్ రణబీర్‌కపూర్, అలియాభట్‌కు చెందిన నూతన గృహప్రవేశానికి రంగం సిద్ధమైంది. ముంబయిలో అత్యంత విలాసవంతంగా నిర్మించుకున్న ఈ భవంతి ఖరీదు 250కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. రణబీర్‌కపూర్ అమ్మమ్మ కృష్ణరాజ్ కపూర్ పేరు మీద ఈ ఇంటిని నిర్మించారు. దాదాపు ఆరు అంతస్తులు కల ఈ భవంతిని రణబీర్, అలియా తమ వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దారని, దాదాపు రెండేళ్లుగా దీని నిర్మాణంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారని అంటున్నారు. బాలీవుడ్ లెజెండ్ రాజ్‌కపూర్ ఇక్కడే నివాసం ఉండేవారట. వారసత్వంగా ఈ ప్రాపర్టీ రణబీర్‌కపూర్‌కు దక్కిందట. దాంతో ఈ గృహాన్ని తమ కలలసౌధంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రణబీర్-అలియా అంత భారీ మొత్తాన్ని వెచ్చించారని తెలిసింది. త్వరలో గృహప్రవేశానికి ఈ స్టార్ కపుల్ సిద్ధమవుతున్నారు. ఇదిలావుండగా ఈ దంపతులు 'లవ్ అండ్ వార్' చిత్రంలో జంటగా నటిస్తున్నారు.

# 'చండీ దుర్గమా' ప్రారంభం



నూతన తారాగణంతో తెరకెక్కిస్తున్న 'చండీ దుర్గమా' చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హెచ్‌బీజే క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మైనుఖాన్ ఎండీ దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి హాస్య నటుడు అలీ క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు మైనుఖాన్ ఎండీ మాట్లాడుతూ..ఇటీవలకాలంలో అమ్మవారి నేపథ్యంలో సినిమాలు రావడం లేదని, ఈ తరం ప్రేక్షకులు నచ్చేలా సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, డార్క్ థీమ్ జోనర్‌లో సరికొత్త స్క్రీన్‌ప్లేతో ఆకట్టుకుంటుందని తెలిపారు. త్వరలో నటీనటులను ప్రకటించనున్న ఈ చిత్రానికి కెమెరా: వైఎస్ కృష్ణ, సంగీతం: ఎంకే, నిర్మాత: జయశ్రీ వెల్ది, రచన-దర్శకత్వం: మైనుఖాన్ ఎండీ.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.